31వ వసంతంలోకి

చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

బుధవారం, నవంబర్ 18 , 2026 పేజీలు : 8

సైబర్ మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

- ర్యాగింగ్, గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి..
- ఉత్తమ వైద్యులుగా ఎదగాలి ఎస్పీ మహేష్ బిగితే



చురకలు ప్రతినిధి, ఎల్లారెడ్డిపేట నవంబర్ 17 : డిజిటల్ యుగంలో విద్యార్థులు సోషల్ మీడియా, ఆన్‌లైన్ వేదికలను వినియోగించే సమయంలో సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. ఆన్‌లైన్‌లో పరిచయమైన వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం, ఫొటోలు, కుటుంబ వివరాలు, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు పంచుకోవద్దని హెచ్చరించారు. వైద్య విద్యార్థులు ర్యాగింగ్, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ వైద్యులుగా ఎదగాలని పిలుపునిచ్చారు.మంగళవారం జిల్లా పరిధిలోని మెడికల్ -మిగతా 2లో

రవాణా శాఖ అధికారుల వాహనాలకు పర్మినెంట్ నంబర్ ప్లేట్లు కరువు..

సామాన్యులకు చలాన్లు..

అధికారుల వాహనాలకు మినహాయింపులా..?



నిబంధనలు చేప్పే అధికారులకే నిబంధనలు వర్తించవా?



చురకలు విలేఖరి,జగిత్యాల: నవంబర్, 17 : రోడ్డు భద్రతా నిబంధనలు పాటించని సామాన్యులపై నిత్యం జరిమానాల కొరడా ఝుళిపించే రవాణా శాఖ అధికారులే నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. “ముందు నువ్వు ఆచరించి, ఆపై ఇతరులకు బోధించు” అనే నానుడిని జగిత్యాల రవాణా శాఖ అధికారులు విస్మరించినట్లు కనిపిస్తోంది.జగిత్యాల రవాణా శాఖ అధికారులు వినియోగిస్తున్న వాహనాలు పర్మినెంట్ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లు లేకుండానే రోడ్లపై తిరుగుతున్నాయి. ఒక కారుకు కేవలం షోరూమ్ టెంపరరీ స్టిక్కర్ ఉండగా, మరో వాహనానికి పసుపు రంగు టెంపరరీ నంబర్ ప్లేట్ మాత్రమే ఉన్నట్లు కనిపిస్తోంది. నిబంధనల ప్రకారం వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన అనంతరం నిర్ణీత విధానంలో పర్మినెంట్ రిజిస్ట్రేషన్ నంబర్‌తో కూడిన హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ (HSRP) బిగించుకోవాల్సి ఉంటుంది. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించే సామాన్య వాహనదారులను మాత్రం అధికారులు ఆపి తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధిస్తుంటారు.కానీ, సాక్షాత్తూ నిబంధనలు అమలు చేయాల్సిన రవాణా శాఖ అధికారుల వాహనాలకే పర్మినెంట్ నంబర్ ప్లేట్లు లేకపోవడం పట్టణ ప్రజల్లో విస్మయం కలిగిస్తోంది. వాహనాల తనిఖీల సమయంలో తమ వాహనాల నంబర్ ప్లేట్లను గుర్తించి అప్రమత్తం అవుతారనే ఉద్దేశంతోనే పర్మినెంట్ నంబర్ ప్లేట్లు బిగించుకోవడం లేదనే ప్రచారం సైతం వినిపిస్తోంది. అయితే, ఈ ప్రచారంలో వాస్తవమెంత అనేది అధికారులే స్పష్టం చేయాల్సి ఉంది.సామాన్యుల వాహనాలకు చిన్నపాటి లోపం కనిపించినా చలాన్లతో హడలెత్తించే అధికారులు.. తమ వాహనాల విషయంలో మాత్రం ఎందుకింత నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. పర్మినెంట్ నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకోవడానికి నిధుల కొరతా..? లేక తమ వాహనాలను ఆపి ప్రశ్నించే అధికారి ఎవరూ లేరనే ధీమానా..? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సామాన్యుడి వాహనానికి నంబర్ ప్లేట్ సరిగా లేకపోయినా జరిమానా విధించే అధికారులు.. తమ వాహనాలకు పర్మినెంట్ నంబర్ ప్లేట్లు ఎందుకు ఏర్పాటు చేసుకోవడం లేదని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. నిబంధనలు సామాన్యులకే పరిమితం కాకుండా అధికారులకు కూడా సమానంగా వర్తించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించి వాస్తవాలను వెల్లడించడంతో పాటు నిబంధనల అమలులో అందరికీ ఒకే విధమైన ప్రమాణాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


ప్రైవేటు కొనుగోళ్లపై రైతులకు పూర్తి స్వేచ్ఛ కల్పించాలి



- జిల్లాలో 438 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
- జగిత్యాల కలెక్టర్ బి. సత్యప్రసాద్

చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 17: ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించాలని, జిల్లాలో ప్రతిపాదించిన అన్ని కొనుగోలు కేంద్రాల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వానాకాలం సీజన్ లో జిల్లావ్యాప్తంగా మొత్తం 438 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని తెలిపారు. రైతులు ఎఫ్‌ఏక్యూ ప్రమాణాల మేరకు నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చిన వెంటనే కొనుగోలు చేసేలా అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 30 శాతం పంట కోతలు పూర్తయ్యాయని, ప్రస్తుతం ప్రైవేటు వ్యాపారులు మద్దతు ధర కంటే అధిక ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నారని వెల్లడించారు. ప్రతి కేంద్రం వద్ద టార్పాలిన్లు, తేమ యంత్రాలు, తూకం యంత్రాలు, తదితర -మిగతా 2లో

ఇందిరమ్మ బీమా నమోదు పకడ్బందీగా చేపట్టాలి



- జిల్లాలో 2,83,453 కుటుంబాల లక్ష్యం
- జిల్లాలో 481 ప్రత్యేక శిబిరాలు
- జిల్లా అదనపు కలెక్టర్ ప్రసూనాంబ

చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 17: ఇందిరమ్మ బీమా నమోదు పకడ్బందీగా చేపట్టాలని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ ప్రసూనాంబ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుపై మంగళవారం కలెక్టరేట్ లోని ఐడీఓసీ సమావేశ-మిగతా 2లో

ముళ్ళ పొదలు తొలగింపు



చురకలు (పెద్దపెల్లి జిల్లా ప్రతినిధి) కమాన్‌పూర్ నవంబర్ 17 : రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్ కార్పొరేటర్ దేవనపల్లి చక్రపాణి ఆధ్వర్యంలో ముళ్ళ పొదలను తొలగించారు. ఏపుగా పెరిగిన ముళ్ళపదలను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఠాగూర్ , రామగుండం మున్సిపల్ మేయర్ మహంకాళి స్వామిల ఆదేశాల మేరకు 18వ డివిజన్ అభివృద్ధిలో భాగంగా హనుమాన్ నగర్ లో పెరిగిన పిచ్చి మొక్కలతోపాటు ముళ్ళ పొదలను తొలగించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ దేవనపల్లి చక్రపానికి డివిజన్ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటైజర్ ఇన్స్పెక్టర్ నాగభూషణం సూపర్వైజర్ సారయ్య తదితరులు పాల్గొన్నారు.

హెచ్ పీవీ వ్యాక్సిన్,
శిశు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 17 : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం హెల్త్ కమిషనర్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ జైపాల్ రెడ్డి, వివిధ విభాగాల అధికారులు హాజరయ్యారు. జిల్లాలో అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని కమిషనర్ సమీక్షించారు. ముఖ్యంగా హెచ్ పీవీ వ్యాక్సినేషన్, తల్లి శిశు ఆరోగ్యం, టీకాల కార్యక్రమం, శిశు మరణాల నివారణపై చర్చించారు. హెచ్ పీవీ వ్యాక్సిన్ గర్భాశయ క్యాన్సర్ నివారణకు ఒక అవకాశమని, ఇది కేవలం టీకా కాదు ఆడపిల్లల భవిష్యత్తుకు రక్షణ అని కమిషనర్ అన్నారు. 9 నుంచి 14 ఏళ్ల బాలికలకు వ్యాక్సిన్ అందించడంలో నిర్లక్ష్యం వహించవద్దని, ప్రతి పాఠశాల, ప్రతి గ్రామంలో లక్ష్యం పూర్తి చేయాలని ఆదేశించారు.గర్భిణీలకు సకాలంలో పరీక్షలు, పోషకాహారం, ఆసుపత్రిలో ప్రసవాలు, నవజాత శిశువులకు టీకాలు తప్పనిసరిగా అందాలని, ఆశా, ఏఎన్ఎంలు ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజల్లో అపోహలు తొలగించి వ్యాక్సిన్ పై నమ్మకం కలిగించాలని,వారానికి పురోగతి నివేదికలు అందించాలని ఆదేశించారు.

సైబర్ మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

మొదటి పేజీ తరువాయి... కళాశాలలో వైద్య విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఎస్పీ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ర్యాగింగ్, గంజాయి, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.సోషల్ మీడియాలో కనిపించే ప్రతి సమాచారాన్ని నిజమని నమ్మవద్దని, తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు, సందేశాలు, అనుమానాస్పద లింకుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ నేరగాళ్లు నకిలీ ఉద్యోగ ప్రకటనలు, బహుమతుల ఆశలు, నకిలీ సోషల్ మీడియా ఖాతాలు, ఆన్‌లైన్ గేమింగ్, డిజిటల్ అరెస్ట్ వంటి మార్గాల్లో విద్యార్థులను మోసం చేసే అవకాశముందని తెలిపారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.మొబైల్ ఫోన్లను చెడు మార్గాలకు కాకుండా విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ఉపయోగించుకోవాలన్నారు. ఆన్‌లైన్ వేధింపులు లేదా అనుమానాస్పద పరిణామాలు ఎదురైతే భయపడకుండా తల్లిదండ్రులు, అధ్యాపకులు లేదా పోలీసుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు.కళాశాలల్లో సీనియర్లు, జూనియర్లు అనే తేడా లేకుండా విద్యార్థులంతా స్నేహపూర్వక వాతావరణంలో విద్యను అభ్యసించాలని అన్నారు. ర్యాగింగ్, మత్తు పదార్థాల వినియోగం విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తాయని హెచ్చరించారు. తెలంగాణను మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా మార్చే లక్ష్యంలో ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. కళాశాల యాజమాన్యం విద్యార్థుల ప్రవర్తనను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బాధితులు కళాశాలలోని యాంటీ ర్యాగింగ్ కమిటీకి వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు.వైద్య విద్యార్థులు తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కష్టపడి చదివి ఉత్తమ వైద్యులుగా ఎదిగి కళాశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ట్రిపుల్ రైడింగ్, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు.విద్యార్థినుల భద్రత కోసం జిల్లా షీ టీం నిరంతరం పనిచేస్తోందని, ఎలాంటి వేధింపులు ఎదురైనా 87126 56425 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.అనంతరం వైద్య విద్యార్థులు గంజాయి, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ప్రదర్శించిన నాటిక పలువురిని ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, అధ్యాపకులు, సైబర్ ఆర్ఎస్ఐ జునైద్, సైబర్ సిబ్బంది గంగారెడ్డి, మహేష్, కిట్టు, అభిషేక్, విజయ్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రైవేటు కొనుగోళ్లపై రైతులకు పూర్తి స్వేచ్ఛ కల్పించాలి

మొదటి పేజీ తరువాయి.... మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యంలో తేమ శాతం ఎఫ్ఏక్యూ నిబంధనల పరిధిలో ఉంటే వెంటనే కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని అవసరమైన చోట గోదాముల్లో భద్రపరచాలని సూచించారు. గోదాములకు తరలించే సమయంలో తేమ శాతం విషయంలో పొరపాట్లు జరగకుండా క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ధాన్యం రవాణా వాహనాల కదలికలను పర్యవేక్షించేందుకు జీపీఎస్ ట్రాకింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.
ప్రైవేటు కొనుగోళ్లపై రైతులకు స్వేచ్ఛ... జిల్లాలో పండిన ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేసే అవకాశం ఉందని, రైతులు కేంద్రాలకు వచ్చినప్పుడు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉంటే కొనుగోలుకు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రైవేటు మార్కెట్లో మంచి ధర వస్తున్నప్పుడు ప్రభుత్వ కేంద్రాల్లోనే అమ్మాలని రైతులపై ఒత్తిడి చేయవద్దని, తమ పంటను ఎక్కడ అమ్ముకోవాలనే విషయంలో రైతులకు పూర్తి స్వేచ్ఛ ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్. ప్రసునాంబ, సివిల్ సప్లై, వ్యవసాయ, రవాణా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ బీమా నమోదు పకడ్బందీగా చేపట్టాలి

మొదటి పేజీ తరువాయి... మందిరంలో అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఎన్. ప్రసూనాంబ మాట్లాడుతూ సీఈఈపీఏసీ సర్వే ప్రకారం జిల్లాలోని 20 మండలాలు, 5 మున్సిపాలిటీల పరిధిలో 2,83,453 కుటుంబాలను నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టామని తెలిపారు. ఇందు కోసం 385 గ్రామ పంచాయతీల్లో 385 కేంద్రాలు, పట్టణాల్లో 96 కేంద్రాలు కలిపి మొత్తం 481 ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కుటుంబంలో ప్రధాన సంపాదన పరులుగా ఉన్న 18 నుంచి 59 ఏళ్ల వారు అర్హులని, ప్రమాదవశాత్తు మరణిస్తే నామినీకి రూ.5 లక్షల సహాయం అందుతుందని వివరించారు. ఆహార భద్రత కార్డు ఉన్నవారే కాకుండా రేషన్ కార్డు లేని అర్హులు ఆధార్ ఆధారంగా నమోదు చేసుకోవచ్చని, ఇతర జిల్లాల రేషన్ కార్డుదారులు కూడా సమీప శిబిరాల్లో నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రతి కేంద్రంలో డేటా ఎంట్రీ ఆపరేటర్, పంచాయతీ కార్యదర్శి అందుబాటులో ఉండాలని, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక వసతులు కల్పించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ నోడల్ అధికారిగా రోజూ సాయంత్రం పురోగతిని సమీక్షిస్తారన్నారు. నవంబర్ 19న ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి కనీసం 5-6 సభ్యత్వాలు నమోదు చేయాలని సూచించారు. ఈ శిక్షణలో సీపీవో సత్యం గౌడ్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాలి

చురకలు విలేఖరి వీణవంక నవంబర్ 17: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందిస్తున్న చేయూత భరోసా పింఛన్లు అందేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని, అర్హులైన లబ్ధిదారు లందరికీ పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని ఆయన సూచించారు.? మంగళవారం వీణవంక మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ గణపతి గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో, మండల పరిధిలోని 26 గ్రామ పంచాయతీలకు చెందిన 561 మంది లబ్ధిదారులకు ఆయన నూతన పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ.. పేదల సంక్షేమం అనేది ప్రభుత్వాల దయాదాక్షిణ్యాలపై ఆధార పడే అంశం కాదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.? ప్రభుత్వం చేయూత పింఛన్ల పంపిణీ చేపట్టి కొంతమంది పేదలకు లబ్ధి చేకూర్చడం అభినందనీయమే అయినప్పటికీ, నియోజకవర్గంలో ఇంకా అనేకమంది



అర్హులైన పేద కుటుంబా లకు పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందకపోవడం బాధాకర మన్నారు. రాజకీయాలకు అతీతంగా, ఎలాంటి వివక్ష లేకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
దళిత బంధు కుటుంబాల పట్ల వివక్ష తగదు: పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్లు ఎంతో భరోసాగా నిలుస్తాయని కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు. గతంలో దళిత బంధు పథకం ద్వారా లబ్ధి పొందిన కుటుంబాల్లోనూ వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ఉన్నారని గుర్తు చేశారు. ఒక కుటుంబానికి దళిత బంధు అందిందనే కారణంతో, ఆ కుటుంబంలోని అర్హులకు పింఛన్లు నిరాకరించడం సరైన విధానం కాదని అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్లు మంజూరు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్, సల్మాన్ రాజ్, ఎంపీడీవో వెంకటేశ్వర్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 17 : జగిత్యాల పట్టణంలోని తీన్ ఖని చౌరస్తా వద్ద గల శ్రీరాం టైలర్స్ యజమాని శంకర్ (42) అనే వ్యక్తి అప్పుల బాధ తట్టుకోలేక మంగళవారం తన దుకాణంలో ఫ్యాన్ కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు వ్యాపారం సరిగ్గా నడవడం లేదని, అప్పులు పెరిగిపోతున్నాయని మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతునికి భార్య, ఓ కుమార్తె ఉన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. జగిత్యాల పట్టణ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నవంబర్ 21న చెక్ బౌన్స్ కేసుల ప్రత్యేక లోక్ అదాలత్



చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 17 : తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి సి.రత్న పద్మావతి మార్గదర్శకత్వంలో జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో ఈ నెల 21న చెక్ బౌన్స్ (చెక్కు బౌన్స్) కేసుల ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక లోక్ అదాలత్ లో పెండింగ్ లో ఉన్న నిగేసియాబుల్ ఇన్స్ట్రుమెంట్స్ యాక్ట్ 1881 సెక్షన్ 138 కు సంబంధించిన కేసులను ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో రాజీ ద్వారా పరిష్కరించుకునే అవకాశం కల్పించబడుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తెలిపింది. సంబంధిత కేసుల్లోని ఫిర్యాదుదారులు, ప్రతివాదులు తమ న్యాయవాదులతో సంప్రదించి రాజీకి సిద్ధమై సంబంధిత న్యాయస్థానాన్ని సంప్రదించాలని, నిర్ణీత తేదీన హాజరై తమ కేసులను పరిష్కరించుకోవాలని సూచించింది. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని న్యాయపరమైన సమయం, ఖర్చు ఆదా చేసుకోవాలని కోరింది.

యామాపూర్‌లో సన్‌రైజ్ హెల్త్ క్యాంప్



చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం, నవంబర్ (17) : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని యామాపూర్ గ్రామంలో మంగళవారం సర్పంచ్ కనుక నాగేష్ ఆధ్వర్యంలో సన్‌రైజ్ హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ శిబిరం ద్వారా గ్రామ ప్రజలకు ఆరోగ్య సేవలు అందించేందుకు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గ్రామస్థులు ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని, అవసరమైన వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాగ్రామ ప్రజలకు ఆరోగ్య సేవలు చేరువ చేయడంలో ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు.ఈకార్యక్రమంలో కార్యదర్శి నవీన్, సర్పంచ్ నాగేష్, ఉపసర్పంచ్ లావణ్య శ్రీనివాస్, వార్డు సభ్యులు రాజేందర్, జలంధర్ ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు సునీల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలి

-వర్షకొండ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం తనిఖీ
-తహసీల్దార్ వరప్రసాద్, ఎంఈఓ బండారి మధు



చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం నవంబర్ (17) : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని వర్షకొండ గ్రామ ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని మంగళవారం తహసీల్దార్ వరప్రసాద్,ఎంఈఓ బండారి మధు పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, వంట తయారీ విధానం, ఆహార పదార్థాల నాణ్యత, వంటగది పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అనే విషయాలను వంట సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా తహసీల్దార్ వరప్రసాద్, ఎంఈఓ బండారి మధు మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం, శారీరక ఎదుగుదల, మానసిక వికాసానికి పౌష్టికాహారం ఎంతో కీలకమని తెలిపారు. పాఠశాల స్థాయిలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం అందించడం కూడా ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం లక్ష్యాలను సమర్థవంతంగా నెరవేర్చేందుకు ఉపాధ్యాయులు,వంట సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన, పౌష్టిక విలువలు కలిగిన భోజనం అందించాలని వంట సిబ్బందికి సూచించారు. వంటకు ఉపయోగించే బియ్యం, పప్పులు, కూరగాయలు తదితర ఆహార పదార్థాల నాణ్యత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. నాణ్యత లేని పదార్థాలను వంటకు ఉపయోగించకూడదని, వంటగది పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.వంట పాత్రలను శుభ్రంగా ఉంచడంతో పాటు ఆహార పదార్థాలను సురక్షితంగా నిల్వ చేసుకోవాలని, వంట చేసే సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. విద్యార్థులకు నిర్ణీత సమయానికి భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులు భోజనం సక్రమంగా తీసుకుంటున్నారా, మెనూలోని అన్ని ఆహార పదార్థాలు అందుతున్నాయా అనే విషయాలను ఉపాధ్యాయులు ప్రతిరోజూ పర్యవేక్షించాలన్నారు.మధ్యాహ్న భోజన పథకం అమలులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా చూడాలని, విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో పౌష్టికాహారం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని సూచించారు. పాఠశాల ఉపాధ్యాయులు, వంట సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోనుకంటి వెంకట్,ఉపసర్పంచ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి




చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 17 : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2.80 లక్షల మంది కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సామాజిక భద్రత పరిరక్షించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్మ దీక్ష చేపట్టారు. అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలనే డిమాండ్ తో ప్రణాళిక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు సామూహిక సాధారణ సెలవు పాటించి నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు గంగాధరి మహేష్, సర్వ సతీష్, గొల్లపల్లి మహేష్ గౌడ్ మాట్లాడుతూ జూలై 11 నుంచి ఆగస్టు 18 వరకు 33 జిల్లాల్లో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించి 80 మంది శాసన సభ్యులు, 7 మంది మంత్రులను కలిసి కేవలం రూ.1500 నుంచి రూ.2500 పెన్షన్ పొందుతున్న పదవీ విరమణ ఉద్యోగుల దుస్థితిని వివరించామన్నారు. ఆగస్టు 23న ఎల్బీ స్టేడియంలో జరిగిన మహాసభ తీర్మానాలను సెప్టెంబర్ 17న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అందజేశామన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు మ్యాన పవన్ కుమార్ మాట్లాడుతూ వెంటనే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, అధ్యయన కమిటీ, ఆరోగ్య పథకం కమిటీలో తమ సంఘ ప్రతినిధులకు చోటు కల్పించాలని, కరువు భత్యం బకాయిలు విడుదల చేయాలని కోరారు.

పెద్దపల్లి,జగిత్యాల రైల్వే లైన్ పరిశీలనకు

కేంద్ర రైల్వే శాఖకు లేఖ

చురకలు, విలేఖరి, వెల్గటూర్, నవంబర్ 17 : పెద్దపల్లి నుండి కోటిలింగాల, ధర్మపురి తదితర పుణ్యక్షేత్రా లను అనుసంధానం చేస్తూ నూతన రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని వెల్గటూర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పత్తి పాక వెంకటేష్ ఇటీవల కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండిసంజయ్ కు వినతిపత్రం అందజేయగా నూతనరైల్వే లైన్ ఏర్పాటుకు నిబంధనల మేరకు తగుచర్యలు తీసుకో వాలని కోరుతూ కేంద్ర రైల్వే మంత్రిత్వశాఖకు సోమవారం లేఖ పంపించినట్లు తెలిపారు. ఈ రైల్వే లైన్ ఏర్పాటు చేస్తే పెద్దపల్లి, జగిత్యాల మధ్య ప్రముఖపుణ్యక్షేత్రాలతోపాటు, టూరిజం అభివృద్ధి జరిగే అవకాశం ఉందని లేఖలో పేర్కొన్నారు.


Dear Shri Shivaji Sutar Maruti Ji,

Hon'ble Union Minister of State for Home Affairs, Shri Bandi Sanjay Kumar, has received a representation from Shri Pathpaka Venkatesh, Former Chairman, Market Committee Velgatoor, Jagatial District, Telangana requesting for sanctioning a new railway line connecting the major pilgrimage and tourist destination between Peddapalli and Jagtial District, Telangana.

2. As desired by the Hon'ble Minister, I am to forward the above request for appropriate action, as per norms.

With regards,

Yours sincerely,

(Andra Vamsi)

Shri Shivaji Sutar Maruti, IRTS
OSD to Hon'ble Minister of Railways,
Government of India,
Rail Bhawan
New Delhi.

రిజర్వ్ సెన్సస్ సిబ్బందికి

డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వాలి



చురకలు విలేకరి,జగిత్యాల, నవంబర్ 17 : జనాభా గణన ఫేజ్-1 హౌస్ లిస్టింగ్,హౌస్ సెన్సస్ కార్యక్రమాల్లో పాల్గొన్న రిజర్వ్ సిబ్బందికి డ్యూటీ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు . స్టేట్‌టీచర్స్ యూనియన్‌జిల్లా అధ్యక్షుడు బైరం హరికిరణ్, ఉపాధ్యక్షుడు తాటికొండ తిరుపతిచారి మంగళవారం కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. సెన్సస్ నియామక పత్రం పొంది శిక్షణ పూర్తి చేసుకుని 11.05. 2026 నుంచి 09.06.2026 వరకు హెడ్ క్వార్టర్ వదలకుండా అందుబాటులో ఉన్నందున విధుల్లోఉన్నట్లు భావించి సర్టిఫికెట్లు మంజూరు చేయాలని కోరారు.

కొండగట్టు చందనోత్సవాల్లో సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో రాగి జావా పంపిణీ



చురకలు ప్రతినిధి, జగిత్యాల,నవంబర్ 17 : కొండగట్టు క్షేత్రంలో 6 రోజుల పాటు జరుగుతున్న చందనోత్సవ వేడుకల సందర్భంగా శ్రీ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు రాగి జావా, పాయసం పంపిణీ చేశారు. అఖండ చాలీసా పారాయణ, ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం,రాత్రి భోజన ఏర్పాట్లు చేస్తున్న విషయం తెలుసుకున్న సత్యసాయి అన్నపూర్ణ ట్రస్టు రాష్ట్ర కో-ఆర్డినేటర్ వూటూరి శ్రీకాంత్ స్పందించి ఈవో అనుమతితో ఉదయం 200 మంది భక్తులకు పోషకాహార పానీయంగా రాగి జావా అందించేందుకు ముందుకు వచ్చారు. ఇందులో భాగంగా మంగళవారం 250మంది భక్తులకు రాగి బెల్లం పాయసం పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఈవో అంజనా రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు,సిబ్బంది పాల్గొని ట్రస్ట్ ప్రతినిధులు నరేష్,శివ, జీషాన్ లను అభినందించారు.

ఇద్దరు మందుబాబులకు ఆరు రోజుల జైలుశిక్ష

చురకలు విలేకరి, జగిత్యాల, నవంబర్ 17 : మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇద్దరికి న్యాయస్థానం ఆరు రోజుల జైలు శిక్ష విధించింది. జగిత్యాల ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో అహ్మద్ వాజిద్ ఖాన్ పట్టుబడగా బ్రీత్ ఎనలైజర్ లో 171 ఎంజీ ఆల్కహాల్ నమోదైంది. రాయికల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటిక్యాలకు చెందిన నరవేణి శ్రీనివాస్ పట్టుబడగా 307 ఎంజీ నమోదైంది. రెండు కేసుల్లో న్యాయస్థానం ఇద్దరికి చెరో ఆరు రోజుల జైలు శిక్ష విధించింది. డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడితే జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పోలీసులు హెచ్చరించారు.

జిల్లా చైర్మన్‌గా బూస వినయ్ కుమార్



చురకలు విలేకరి, జగిత్యాల, నవంబర్ 17 : జవహర్ బాల మంచ్ జగిత్యాల జిల్లా చైర్మన్ గా పట్టణానికి చెందిన బూస వినయ్ కుమార్ ను నియమిస్తూ రాష్ట్ర చైర్మన్ మామిడి రిషికేశ్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అనుబంధంగా ఏర్పాటైన ఈ కమిటీ ద్వారా జిల్లాలోని అన్ని మండలాల్లో 17 ఏళ్ల లోపు బాలబాలికలతో కమిటీలు ఏర్పాటు చేసి వారిలో సృజనాత్మకతను వెలికితీసేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని రిషికేశ్ రెడ్డి తెలిపారు. నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సామ్రాట్ వంశీలకు వినయ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి అప్రజాస్వామికం



చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 17 : కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ దౌర్జన్యకారుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.జీవన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జీవన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా పాలనలో ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక భయభ్రాంతులకు గురి చేసే విధంగా దాడులకు పాల్పడడం అప్రజాస్వామికమన్నారు. క్యాంపు కార్యాలయంపై దాడి చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సమష్టి చర్యలు

-కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఎస్పీ జానకి షర్మిల



చురకలు ప్రతినిధి,నిర్మల్, నవంబర్, 17 : నిర్మల్ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఎస్పీ జానకి షర్మిల సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రతా సమావేశంలో కలెక్టర్, ఎస్పీ పాల్గొని రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తరచుగా ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్‌లను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రహదారులపై అక్రమ పార్కింగ్, ఆక్రమణలను తొలగించాలని, పశువులు రోడ్లపై సంచరించకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిరంతరం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా వాహన తనిఖీలను ముమ్మరం చేస్తూ, మద్యం సేవించి వాహనాలు నడిపేవారు, హెల్మెట్ ధరించకుండా ప్రయాణించేవారు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపేవారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రోడ్డు భద్రతపై ప్రజలకు నిరంతరం అవగాహన కల్పిస్తున్నామని, ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలతో సమన్వయంతో పనిచేస్తామని పేర్కొన్నారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించేవారు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని కలెక్టర్, ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకట మాధవ రావు, ఖైసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డీఎస్పీ శ్రీనివాస్, డీఎంహెచ్ఓ రాజేందర్, ఆర్ అండ్ బీ ఈఈ సుభాష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ఘనంగా పోచమ్మ,ఎల్లమ్మ బోనాలు



-ఇంటికో బోనమెత్తిన గౌడ సంఘం మహిళలు

చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట నవంబర్ 17 : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో స్థానిక గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట నూతన ఆలయ ప్రవేశం సందర్భంగా మంగళవారం గ్రామ దేవత శ్రీ పోచమ్మ తల్లి శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లికి గ్రామంలోని గౌడ సంఘం మహిళలు ఇంటికో బోనం ఎత్తి ఘనంగా బోనాలు పండుగను జరుపుతున్నారు.. మహిళలు బోనాలను ఎత్తుకొని డప్పు చప్పుల మధ్య పోతరాజుల విన్యాసాలతో శివసత్తుల పూనకాలతో సమూహికంగా ఊరేగింపుగా పోచమ్మ వద్దకు వెళ్లి మొక్కులు చెల్లించుకుని అక్కడి నుండి ఎల్లమ్మ ఆలయానికి వెళ్ళి బోనాలను ఎల్లమ్మ తల్లికి తీపి కూరగాయ వంటలతో సమర్పించుకున్నారు.తమ వృత్తిని పాడిపంటను పిల్లపాపలను సల్లంగా చూడాలని శ్రీ పోచమ్మ తల్లిని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ని మొక్కుకున్నారు.శ్రీ పోచమ్మ తల్లికి శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లికి బోనాల సమర్పించుకోవడానికి ఊరేగింపుగా వెళ్ళిన మహిళలను చూసి గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.



పిల్లల విద్యాభివృద్ధే బలమైన సమాజానికి పునాది



చురకలు విలేకరి, జగిత్యాల, నవంబర్ 17 : పిల్లల విద్య, పెంపకం, ఉజ్వల భవిష్యత్తు కోసం కృషి చేయడమే బలమైన సమాజ నిర్మాణానికి పునాది అని వక్తలు పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల జగిత్యాలలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డీసీసీ మైనారిటీ అధ్యక్షుడు ఖాజా నయీముద్దీన్ ముఖ్య అతిథిగా పాల్గొనగా, ముస్లిం సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్ బారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో విద్యా, నైతిక, సృజనాత్మక సామర్థ్యాలను కొనియాడుతూ వారికి బహుమతులు అందజేసి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో నాయబ్ సదర్ మీర్ యాసీన్ అలీ అషర్, ఖిలా ఈద్గా సదర్ షాజీ ఫిరోజ్, ఆదిల్ పటేల్, పట్వారీ ముజాహిద్, రిటైర్డ్ హెడ్మాస్టర్లు మునీముద్దీన్, నసీముద్దీన్, కౌన్సిలర్ అబ్దుల్ వాసెద్, హెచ్ఎం అబ్దుల్లా బేగ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

చురకలు విలేకరి, కొడిమ్యాల, నవంబర్ 17 : కొడిమ్యాల మండల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం నాచుపల్లి బృందావనం రిసార్ట్ లో నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు పులి వెంకటేష్ తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ హాజరుకానున్నారన్నారు.మండలంలోని ప్రజాప్రతినిధులు, గ్రామ, మండల అనుబంధ సంఘాల నాయకులు, సీనియర్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బోర్నపల్లికి ఆధ్యాత్మిక శోభ

-ప్రతిష్టకు ముస్తాబైన బోర్నపల్లి శ్రీ లక్ష్మీ గణపతి ఆలయం
-నేటి నుండి మూడు రోజులపాటు ప్రతిష్టాపన కార్యక్రమాలు
-హుజురాబాద్ ఆధ్యాత్మిక సమాజానికి మరో దేవాలయం
-ఆలయ ప్రతిష్టను విజయవంతం చేయండి - కమిటీ పిలుపు



(కోరెం సుధాకర్ రెడ్డి చురకలు ప్రతినిధి హుజురాబాద్)

హుజురాబాద్ ఆధ్యాత్మిక సమాజానికి మరో దేవాలయం అందుబాటులోకి వచ్చింది. ఇప్పటికే స్థానికంగా పురాతన శివాలయం, ఆంజనేయ స్వామి ఆలయం, ప్రతాపవాడ శివాలయం, రామాలయం, కృష్ణాలయం, పాటి మీది హనుమాన్, సరస్వతి, సాయిబాబా ఆలయం, కన్యకా పరమేశ్వరి, అయ్యప్ప దేవాలయాలతో ప్రత్యేకత నెలకొంది. దీనికి బోర్నపల్లిలో శివాలయం, కొత్తపల్లి నాగేంద్ర స్వామి ఆలయం, సింగాపురం కేసీ క్యాంపు లలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాలు ఆధ్యాత్మిక క్షేత్రాలుగావిలసిల్లుతున్నాయి. ఒకప్పుడు కేవలం ఒక చిన్న మందిరం గా భక్తుల పూజలందుకున్న బోర్నపల్లి శ్రీలక్ష్మీగణపతి ఆలయం,నేడు అద్భుత మైన శిల్పకళా శోభతో జిల్లాలోనే రెండో అతిపెద్ద గణపతి క్షేత్రంగా వర్ధిల్లనుంది. భక్తుల అచంచల మైన విశ్వాసం,దాతల ఉదార హృదయం,స్థానిక గ్రామస్థుల అవిశ్రాంత సమిష్టి కృషి తోడై ఈ పుణ్యక్షేత్రం ఆధ్యాత్మిక కేంద్రంగా రూపుదిద్దుకుంది. ఈ నూతన ఆలయంలో ఈ నెల 18 నుండి 20వ తేదీ వరకు మూడు రోజుల పాటు విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలను కన్నులపండువగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సర్వం సిద్ధం చేసింది.ఆధ్యాత్మిక ప్రవచనాలు,విశేష హోమాలు, పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ బోర్నపల్లి ప్రాంతమంతా ఇప్పటికే భక్తి పారవశ్యంలో మునిగిపోయింది.

దేవాలయ నేపథ్యం..

2013 డిసెంబర్ మాసంలో బోర్నపల్లిలోని సిద్ధార్థనగర్ కాలనీ సమీపంలో శ్రీ లక్ష్మీగణపతి ఆలయం ప్రారంభమైంది. నాటి నుండి స్వామివారి మహిమ, భక్తుల ఆదరణ దినదిన ప్రవర్ధమానంగా పెరుగుతూ రావడంతో ఆలయాన్ని విస్తరించి, పునర్నిర్మించాలనే సంకల్పానికి శ్రీకారం చుట్టారు.ఈ క్రమంలో 2021వ సంవత్సరంలో దొంత రమేష్ అధ్యక్షుడిగా,అంగరిక రాజేంద్రప్రసాద్ ప్రధాన కార్యదర్శిగా ఆలయ అభివృద్ధి కమిటీ ఏర్పడి నిర్మాణ పనులను వేగవంతం చేసింది.నాటి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు,తన్నీరు హరీశ్‌రావు, గంగుల కమలాకర్‌తో పాటు ప్రస్తుత మంత్రి పొన్నం ప్రభాకర్ అందించిన విశేష సహకారం, దేవాదాయ శాఖ నిధులు భక్తుల విరాళాలతో ఆలయాన్ని సకల ఆధునిక హంగులతో, ఆగమ శాస్త్ర నియమాల ప్రకారం అత్యంత సుందరంగా నిర్మించారు.

కార్యక్రమాల వివరాలు

ఈ నెల 18వ తేదీ నుండి ప్రారంభమయ్యే ఈ త్రిదిన ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో ప్రతిరోజూ విశిష్ట కార్యక్రమాలు జరగనున్నాయి. ఉత్సవాలలో రెండో రోజైన 19వ తేదీన కర్ణాటక రాష్ట్రంలోని ప్రసిద్ధ కుక్కే సుబ్రహ్మణ్య మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ డాక్టర్ విద్యాప్రసన్న తీర్థ స్వామివారు విచ్చేసి,తమ దివ్య అనుగ్రహ భాషణం తో భక్తులను ఆశీర్వదించనున్నారు. చివరి రోజైన 20వ తేదీన రాయచోటిలోని శ్రీ సిద్ధి ఆంజనేయ స్వామి దేవస్థానం ధర్మాధికారి పవన్ ఆచార్య స్వామివారి పవిత్ర ఆధ్వర్యంలో, ప్రధాన అర్చకుడు పండిత భాస్కర శర్మ మంగళకరమైన వేదమంత్రోచ్చారణల మధ్య విగ్రహ ప్రతిష్ఠాపన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు.

విస్తృత ఏర్పాట్లు

దేవాలయ ప్రతిష్టకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లు ఆలయ కమిటీ చేస్తోంది.మూడు రోజుల పాటు ప్రతిరోజూ మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నప్రసాద వితరణ చేసేందుకు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేశారు.

హాజరుకానున్న మంత్రులు, ప్రముఖులు

బోర్నపల్లి శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ ప్రతిష్టాపన అపూర్వ ఆధ్యాత్మిక మహోత్సవానికి రాష్ట్ర, కేంద్ర స్థాయి ప్రముఖులను ఆలయ కమిటీ సాదరంగా ఆహ్వానించింది. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు ఈ వేడుకలకు హాజరై స్వామివారిని దర్శించుకోనున్నారు.

ధర్మమార్గంలో పయనించాలి - శ్రీ విద్యాప్రసన్న తీర్థస్వామి

సకల విఘ్నాలను తొలగించే ఆ వినాయకుడి సంపూర్ణ అనుగ్రహం లేనిదే ఏ శుభకార్యమూ పరిపూర్ణం కాదని శ్రీ విద్యాప్రసన్న తీర్థస్వామి ఉద్ఘాటించారు. ఎంతో భక్తిశ్రద్ధలతో, నియమనిష్ఠలతో నిర్మించిన ఈ నూతన ఆలయంలో ప్రతిష్ఠాపన మహోత్సవం జరగడం ఈ ప్రాంత ప్రజల పూర్వజన్మ సుకృతమని ఆయన పేర్కొన్నారు. నేటి ఆధునిక కాలంలో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకొని సన్మార్గంలో, ధర్మమార్గంలో నడవాలని, సమాజంలో ఐకత్య, శాంతి, సద్భావన వెల్లివిరియాలని ఆ మహాగణపతిని మనసారా ప్రార్థిస్తున్నట్లు స్వామివారు సందేశమిచ్చారు.

అధిక సంఖ్యలో తరలివచ్చి తరించాలి - పండిత భాస్కర శర్మ, ప్రధాన అర్చకులు

ఆగమ శాస్త్ర ప్రకారం నేటి (బుధవారం) నుండి మూడు రోజుల పాటు అత్యంత నిష్ఠతో ప్రత్యేక పూజలు, హోమాలు, వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ప్రధాన అర్చకుడు పండిత భాస్కర శర్మ తెలిపారు. భక్తులందరూ కుటుంబ సమేతంగా ఈ మహోత్సవాల్లో అధిక సంఖ్యలో పాల్గొని శ్రీలక్ష్మీ గణపతి స్వామివారి దివ్య ఆశీస్సులు పొందాలని, ప్రశాంత వాతావరణంలో స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించి జన్మను సార్థకం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

హుజురాబాద్ క్లబ్లో మాజీ ఎంపీ కెప్టెన్ జన్మదిన వేడుకలు



చురకలు ప్రతినిధి హుజురాబాద్ నవంబర్ 17 : మాజీ ఎంపీ, హుజురాబాద్ క్లబ్ గౌరవ చైర్మన్ కెప్టెన్ వి లక్ష్మీకాంతరావు జన్మదిన వేడుకలు మంగళవారం హుజురాబాద్ క్లబ్లో జరిగాయి.కొత్తగా ఎన్నికైన కార్యవర్గం ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు.క్లబ్ మాజీ అధ్యక్షులు, సలహాదారు తుమ్మల శ్రీరామ్ రెడ్డి కేక్ కట్ చేసి కెప్టెన్ కు జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు.ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. క్లబ్ కార్యదర్శి మల్లారెడ్డి, ఉపాధ్యక్షులు ప్రభాకర్ రావు కెప్టెన్ చేసిన సేవలను ప్రశంసించారు. కెప్టెన్ వ్యవసాయ రంగంలో, విద్యారంగంలో, రాజకీయ రంగంలో, సేవారంగంలో రాణించారని ప్రశంసించారు. దేశ రక్షణ కోసం సైన్యంలో పని చేశారని యుద్ధంలో పాల్గొన్నారని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలోనూ కీలక భూమిక పోషించారని అన్నారు. హుజురాబాద్ క్లబ్ నిర్మాణంలో ప్రధాన భూమిక పోషించి అందరికీ ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, క్లబ్ కార్యదర్శి కట్కూరి మల్లారెడ్డి, ఉపాధ్యక్షులు, పుల్లూరి ప్రభాకర్ రావు, సంయుక్త కార్యదర్శి శివనాథుని వేణుగోపాల్, కోశాధికారి గర్రెపల్లి శ్రీనివాస్, ఈసీ సభ్యులు గడ్డం ధర్మారెడ్డి, కేశిరెడ్డి నరసింహారెడ్డి, మేకల రాజిరెడ్డి, అక్కినపల్లి అనిల్ కుమార్, గోలి సురేష్, శ్రీధర్, సభ్యులు కేతిరి శ్రీనివాస్ రెడ్డి, కంకణాల భగవాన్ రెడ్డి, విజయ రెడ్డి, వీరసేనారెడ్డి, ఎర్రం నారాయణరెడ్డి, ఆర్కే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప దేవాలయంలో వైభవంగా మహా పడిపూజ మహోత్సవం

-శాస్త్రోక్తంగా ధ్వజారోహణ కార్యక్రమం



చురకలు ప్రతినిధి హుజురాబాద్ నవంబర్ 17 : హుజురాబాద్ పట్టణంలోని జమ్మికుంట రోడ్డులోని నవగ్రహ సహిత శ్రీ సంతోషి మాత పరివార దేవత సహిత శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో మండల దీక్షను పురస్కరించుకొని మంగళ వారం మహా పడిపూజ మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో, కన్నులపండువగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ కొత్త అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక వేడుకకు పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుండి అయ్యప్ప మాలధారులు, భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. వేద పండితులు ఎస్ కిరణ్ కుమార్ ఆచార్యులు, సుజిత్ శ్రీమాన్ ఆచార్యులు మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గణపతి పూజ, గణపతి హోమం, అభిషేకాలు మరియు వివిధ ప్రత్యేక పూజలు జరిపారు. సర్వాంగ సుందరంగా, వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన పద్దెనిమిది మెట్లకు (పడికి) జ్యోతి ప్రజ్వలన చేసి మహా పడిపూజను కనులవిందుగా నిర్వహించారు. భక్తులందరూ ఏకకంఠంతో చేసిన "స్వామియే శరణం అయ్యప్ప" శరణుఘోషలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. అనంతరం మాలధారులకు, భక్తులకు రాత్రి అల్పాహార కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గురుస్వాములు మరియు పట్టణ ప్రముఖులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మాజీ ఎంపీ "కెప్టెన్"కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కేటీఆర్, హరీష్ రావు

-కెప్టెన్‌కు జన్మదిన ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, అభిమానులు



చురకలు ప్రతినిధి, హుజరాబాద్, నవంబర్ 17 : మాజీ రాజ్యసభ సభ్యులు కెప్టెన్ వి లక్ష్మి కాంతారావు జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. కుటుంబ సభ్యుల అభిమానుల కోలాహలం మధ్య కెప్టెన్ కేక్ కట్ చేశారు. బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫోన్ చేసి కెప్టెన్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కెప్టెన్ నివాసానికి పుష్ప గుచ్ఛం తో పాటు జన్మదిన సందేశం లేఖను పంపించారు. మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు కెప్టెన్ కు ఫోన్ ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శాసనమండలి డిప్యూటీ చైర్మన్ ఎమ్మెల్సీ బండ ప్రకాష్ కెప్టెన్ కు జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. వరంగల్ వెస్ట్ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ కెప్టెన్ ను ఆయన నివాసంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, కూడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, ప్రొఫెసర్ రామయ్య, కట్టంగూరి రామచంద్రారెడ్డి, తుమ్మల శ్రీరామ్ రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ డాక్టర్ ఎం సుధీర్ కుమార్, బీరవోలు మహేందర్ రెడ్డి, బి ఆర్ ఎస్ నాయకులు పాక్స్ చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్, బిల్లా వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీపీ తంగేడ శాలిని మహేందర్, పిట్టల మహేందర్, తంగేడ నగేష్, బాపూరావు, మాజీ సర్పంచ్ గొల్లె మహేందర్, శేషు, మాజీ ఎంపిటిసి రాజు, ఎల్వి అర్జున్ హుజురాబాద్, హుస్నాబాద్, హనుమకొండ, కరీంనగర్ ప్రాంతాలకు చెందిన అనేకమంది నేతలు, అభిమానులు, కార్యకర్తలు కెప్టెన్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బి ఆర్ ఎస్ యువ నేతలు కామిరెడ్డి క్రాంతి, శ్రీకాంత్ గౌడ్ (చిట్టి గౌడ్) కెప్టెన్ దంపతులను గజమాలతో సన్మానించారు.

నిరుపేద కుటుంబానికి చేయూత



చురకలు (పెద్దపల్లి జిల్లా ప్రతినిధి)కమాన్ పూర్ గోదావరిఖని నవంబర్ 17 : రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిరుపేద కుటుంబానికి జమియత్ ఉల్ ఉలిమ వారు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.పీకే రామయ్య కాలనీ ఇందిరానగర్ లో నివాసముంటున్నటువంటి లింగయ్య చాలా రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు వారికి కుమారులు ఎవరూ లేనందున తన కుమార్తె వద్ద జీవనం సాగిస్తున్నారు. చాలా పేదరికంతో బాధపడుతున్నటువంటి లింగయ్య కుటుంబానికి నడవడానికి స్టాండ్ కూడా లేకుండే పరిస్థితిని చూసి ఏదైనా సహాయం చేద్దామని జమియత్ ఉల్ ఉలేమా రామగుండం తరపున నడవడానికి వాకర్ స్టాండ్ మరియు నెలకు సంబంధించినటువంటి రేషన్ సామాగ్రి అందజేయడం జరిగింది.మౌలానా షాకీర్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా సహాయం చేయడానికి ఎవరికీ ఏ కులం అద్దం రాకూడదని అందరూ కలిసిమెలిసి ఉండాలని రామగుండం జమియత్ ఎల్లప్పుడూ సహాయం చేయడంలో ముందుంటుందని తెలపడం జరిగింది.ఈ కార్యక్రమంలో జమియత్ ఉల్ ఉలేమా రామగుండం అధ్యక్షులు మౌలానా అబ్దుల్ కరీం ఉపాధ్యక్షులు మౌలానా అబ్దుల్ రెహమాన్ షాకీర్ జమా మస్జిద్ ఇమామ్ మౌలానా మునవర్ నాజిముద్దీన్ గారు హాఫేస్ హుస్సేన్ తిలక్ నగర్ మస్జిద్ సదర్ గౌస్ పాషా వలి పాషా వీరన్న మేస్త్రి మరియు తదితరులు పాల్గొనడం జరిగింది.

పార్లమెంటరీ కమిటీ నుండి ఆహ్వానం



చురకలు (పెద్దపెల్లి జిల్లా ప్రతినిధి) కమాన్‌పూర్ నవంబర్ 17 : కమాన్ పూర్ మండలం జూలపల్లి గ్రామానికి చెందిన సింగరేణి ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం ఎగ్జిక్యూటివ్ సభ్యుడు ఇరుగు రాళ్ల శ్రీనివాస్ కు ఆహ్వానం పంపించారు. ఆర్ జి త్రీ పరిధిలోని ఓసిపి వన్ లో ఉద్యోగం చేస్తున్న ఇరుగు రాళ్ల శ్రీనివాస్ కు ఈనెల 19న హైదరాబాద్లోని రాజ్ కృష్ణ హోటల్లో జరిగే ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులతో జరిగే చర్చల్లో పాల్గొన్నారు అని ఆహ్వానం పలికారు. ఈ సమావేశంలో ఎస్సీ ఎస్టీ ఉద్యోగులకు ఉద్యోగాలు లభిస్తున్న ప్రాతినిధ్యం వారి హక్కులు సంక్షేమ పథకాలు మరియు ఇతర సమస్యలపై పార్లమెంటరీ కమిటీ చర్చించనుంది. అలాగే ఈ సందర్భంగా తమ సమస్యలు సూచనలు మరియు వినతి పత్రాలను కమిటీకి సమర్పించనున్నారు. ముఖ్యంగా సింగరేణి సంస్థలో వారికి సంక్షేమానికి సంబంధించిన అంశాలను నేరుగా పార్లమెంటరీ కమిటీకి తీసుకెళ్లేందుకు ఇది మంచి అవకాశం. తనకు ఈ అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నారని ఇరుగు రాళ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు.

భారత్ సమ్మిట్ వ్యాఖ్యలపై ఎస్పీకి బీజేపీ ఫిర్యాదు



చురకలు ప్రతినిధి,నిర్మల్, నవంబర్, 17 : హైదరాబాద్‌లో నిర్వహించిన 'భారత్ సమ్మిట్-2026'లో విదేశీ రాజకీయ ప్రతినిధి శ్రీ జియాకోమో ఫిలిబెక్ చేసిన రాజకీయ వ్యాఖ్యలు, వీసా నిబంధనలు, ఇమ్మిగ్రేషన్ చట్టాల ఉల్లంఘనకు సంబంధించిన అంశాలపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ నిర్మల్ జిల్లా భారతీయ జనతా పార్టీ నాయకులు జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిలకు ఫిర్యాదు చేశారు.ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రావుల. రాంనాథ్, కౌన్సిలర్లు ఓడిసేలా.అర్జున్,శశాంక్, శ్రీరామోజు. నరేష్, పలువురు నాయకులు పాల్గొన్నారు

బాల సాహితీ వనంలో విరబూసిన

అక్షర సుమం.. అమ్మిన శ్రీనివాసరాజు

-విద్యాబోధనలో ఆదర్శం.. సాహితీ సృజనలో విలక్షణం.. బాలల హృదయాలను కొల్లగొట్టిన కథకుడు జాతీయస్థాయి -బాల సాహిత్య పురస్కారానికి ఎంపిక కావడం తెలుగు సాహిత్యానికి గర్వకారణం -సరిహద్దులు దాటిన తెలుగు కథా పరిమళం.. -2026 జాతీయ బాల సాహిత్య పురస్కారానికి ఎంపికైన డాక్టర్ అమ్మిన శ్రీనివాసరాజుపై ప్రత్యేక వ్యాసం



రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494

అక్షరం ఒక ఆలోచనకు ప్రతిరూపం అయితే, సాహిత్యం ఒక సమాజపు సంస్కృతికి నిలువుటద్దం; అందులోనూ బాల సాహిత్యం భావితరాల భవిష్యత్తుకు వేసే బంగారు బాట. పసిప్రాయపు లేలేత హృదయాల్లో మంచితనపు బీజాలు నాటుతూ, ఊహాలోకాలకు రెక్కలు తొడుగుతూ, విజ్ఞానపు వెలుగులు నింపుతూ, మానవీయ విలువల పరిమళాలను వెదజల్లే బాల సాహిత్యం సమాజ నిర్మాణంలో అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుంది. పెద్దల కోసం రాయడం వేరు, పిల్లల మనస్తత్వాన్ని ఆకళింపు చేసుకొని వారి ఆలోచనా ప్రపంచంలోకి ప్రవేశించి, వారిని అక్షరాల అద్భుత లోకంలో విహరింప జేయడం వేరు; అది ప్రతి రచయితకు సాధ్యమయ్యే విషయం కాదు. అందుకు ప్రత్యేకమైన సృజనాత్మక దృష్టి, బాలల పట్ల అమితమైన వాత్సల్యం, సరళమైన భాషపై పట్టు, భావవ్యక్తీకరణలో అసాధారణ నేర్పు అవసరం. అలాంటి అరుదైన సుగుణాలను తనలో మేళవించుకొని, అధ్యాపక వృత్తిని అక్షర సేవతో అనుసంధానిస్తూ తెలుగు భాషా సాహిత్య వికాసానికి విశేషంగా కృషి చేస్తున్న ప్రముఖ సాహితీవేత్త, కళాశాల తెలుగు ఉపన్యాసకులు, మృదుమధుర భాషి డాక్టర్ అమ్మిన శ్రీనివాసరాజు జాతీయస్థాయి బాల సాహిత్య పురస్కారానికి ఎంపిక కావడం తెలుగు సాహితీ లోకానికి అత్యంత ఆనందదాయకమైన, గర్వకారణమైన పరిణామం. ఒక వ్యక్తి సాధించిన పురస్కారంగా మాత్రమే కాకుండా, మారుమూల అటవీ, గ్రామీణ నేపథ్యం నుంచి ఎదిగి, తన అక్షర ప్రతిభతో జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన సాహితీవేత్తకు దక్కిన సముచిత గౌరవంగా దీనిని అభివర్ణించవచ్చు.1971 ఏప్రిల్ 21న అప్పటి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో, ప్రస్తుత ములుగు జిల్లాలోని గోదావరి తీర ప్రాంతమైన వాజేడు మండలం లక్ష్మీపురం గ్రామంలో నూకరాజు, పళ్ళాలమ్మ దంపతులకు అమ్మిన శ్రీనివాసరాజు జన్మించారు. ప్రకృతి ఒడిలో, పల్లెటూరి జీవన సంస్కృతికి అత్యంత చేరువగా పెరిగిన ఆయన బాల్యం, పరిసరాల సునిశిత పరిశీలన, సామాన్య ప్రజల జీవన విధానాల పట్ల ఆసక్తి, సామాజిక అనుభవాలు తదనంతర సాహితీ ప్రస్థానానికి బలమైన పునాదులుగా నిలిచాయి. పల్లె జీవితంలోని సహజత్వం, శ్రమజీవుల అనుభవాలు, ప్రకృతితో ముడిపడిన జీవన విధానం, మానవ సంబంధాల్లోని ఆర్ద్రత రచయితకు విలువైన అనుభవ సంపదను అందిస్తాయి;ఆ అనుభవాలను సజీవమైన అక్షరాల్లోకి అనువదించగలిగినప్పుడే రచనకు నిజమైన ప్రాణప్రతిష్ఠ జరుగుతుంది. మాతృభాషపై మక్కువతో ఉన్నత విద్యను అభ్యసించిన ఆయన ప్రతిష్ఠాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి తెలుగు సాహిత్యంలో ఎం.ఏ పట్టా పొందారు. అనంతరం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో లోతైన పరిశోధన సాగించి పీహెచ్‌డీ పట్టా సాధించారు.ఉన్నత విద్యాభ్యాసం, పరిశోధనాత్మక అధ్యయనం ఆయనలోని సాహిత్య దృష్టిని మరింత పదునుపెట్టాయి. ప్రస్తుతం ములుగు జిల్లా వాజేడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు ఉపన్యాసకులుగా విధులు నిర్వహిస్తూ,తరగతి గదిలో విద్యార్థులకు తెలుగు భాషా సాహిత్యాల ఔన్నత్యాన్ని బోధిస్తూనే, మరోవైపు స్వయంగా రచనలు చేస్తూ సమాజంలో సాహితీ చైతన్యాన్ని విస్తరింపజేస్తున్నారు. బోధన ఒక వృత్తి అయితే, రచన ఒక ప్రవృత్తి; భాషా సేవ ఒక బాధ్యత అయితే, బాల సాహిత్య సృజన ఒక సామాజిక ధర్మంగా భావించి ఈ మూడింటినీ సమన్వయపరచుకొని సాగుతున్న ఆయన జీవన ప్రయాణం అందరికీ ఆదర్శప్రాయం. ఆయన రచనా ప్రస్థానానికి డిగ్రీ విద్యాభ్యాస దశలోనే బీజం పడింది. రచయిత డి.బి. చారి అందించిన ప్రోత్సాహం, మార్గదర్శకత్వం ఆయనలోని రచనా తృష్ణకు తొలి ప్రేరణగా నిలిచాయి. తొలినాళ్లలో ప్రారంభ మైన రచనా వ్యాసంగం క్రమంగా విస్తరించి కథలు, వ్యాసాలు, బాల సాహిత్య సంపుటాలు, జీవిత చరిత్ర రచనల వరకు వ్యాపించింది. అమ్మిన శ్రీనివాసరాజు బాల సాహిత్య రచనల్లో ఒక విలక్షణమైన ఆకర్షణ కనిపిస్తుంది. పిల్లలకు ఎంతో ఇష్టమైన తీపి తినుబండారాల పేర్లతో తన కథా సంపుటాలకు నామకరణం చేయడం ఆయన సృజనాత్మక వైవిధ్యా నికి నిదర్శనం.2002లో వెలువరించిన 'రసగుల్లాలు', 2006లో ప్రచురించిన 'పూతరేకులు',2014లో తీసుకొచ్చిన 'చంద్రవంకలు' అనే బాలల కథా సంపుటాలు ఈ ప్రత్యేకతకు అద్దం పడతాయి. చిన్నారుల మనసులను ఇట్టే ఆకట్టుకునే పదాలను శీర్షికలుగా ఎంచుకోవడంలోనే వారి అభిరుచులను లోతుగా అర్థం చేసుకున్న రచయితగా ఆయన ప్రతిభ స్పష్టమవుతుంది. తీపి పదార్థాలు నాలుకకు రుచినిచ్చినట్లే, బాల సాహిత్య కథలు చిన్నారుల మనసులకు ఆనందాన్ని, ఆలోచనలకు పదును, వ్యక్తిత్వానికి పరిపక్వతను అందించాలన్నదే ఆయన ఆశయం. బాల సాహిత్యం అంటే కేవలం శుష్క నీతులు బోధించడం మాత్రమే కాదు; పిల్లల్లో సహజమైన కుతూహలాన్ని రేకెత్తిస్తూ,ప్రశ్నించే తత్వాన్ని పెంపొందిస్తూ, తమ చుట్టూ ఉన్న ప్రకృతిని, సమాజాన్ని పరిశీలించే దృష్టిని కలిగించాలి. జంతువులు, పక్షులు, చెట్లు, అడవులు, గ్రామీణ జీవనం,స్నేహం,సహకారం, సమానత్వం వంటి అంశాలను రసవత్తరమైన కథల రూపంలో అందించినప్పుడే పిల్లలు వాటిని హృదయానికి హత్తుకుంటారు. ఆయన రచనా వైవిధ్యం బాలల కథలకే పరిమితం కాకుండా'గ్రీష్మంలో వసంతం' ,'అక్షర దక్షిణ','న్యాయపతి రాఘవరావు కథలు','జలగం వెంగళరావు జీవిత చరిత్ర' వంటి విలువైన గ్రంథాలతో మరింత సుసంపన్నమైంది. ముఖ్యంగా 2015లో వెలువడిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు జీవిత చరిత్ర, చారిత్రక వ్యక్తుల జీవితాలను, వారి కాలపు సామాజిక,రాజకీయ పరిణా మాలను భావితరాలకు పరిచయం చేసే పరిశోధనాత్మక ప్రయత్నంగా ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుంది. ఒక మహావ్యక్తి జీవితాన్ని అక్షరబద్ధం చేయడం అంటే కేవలం కాలక్రమణికను నమోదు చేయడం కాదు; ఆ కాలపు పరిస్థితులు, సమాజంపై వారు వేసిన ముద్ర, ఎదుర్కొన్న సవాళ్లను సమగ్రంగా ఆవిష్కరించడం. అమ్మిన శ్రీనివాసరాజు రచనా ప్రతిభకు రాష్ట్రాల సరిహద్దులు దాటి గౌరవం దక్కడం తెలుగు వారందరికీ గర్వకారణం. ఒక ప్రాంత రచయిత కథ పొరుగు రాష్ట్రంలోని విద్యార్థుల పాఠ్యాంశంలో భాగం కావడం ఆ రచనలోని భావసౌందర్యా నికి, కథన నైపుణ్యానికి నిదర్శనం. అంతేకాకుండా ఆయన రచించిన 'ఇసురాయి' కథ దేశ అత్యున్నత సాహిత్య సంస్థ అయిన కేంద్ర సాహిత్య అకాడమీ ప్రచురించిన సంపుటిలో చోటు సంపాదించుకోవడం మరో విశేషం. ప్రాంతీయ పరిధులను అధిగమించి జాతీయస్థాయి పాఠకలోకానికి ఆయన రచనలు చేరువవుతున్నాయనడానికి ఈ రెండు ఘనతలు తిరుగులేని నిదర్శనాలు. ఆయన నిరంతర సాహిత్య సేవను గుర్తిస్తూ అనేక సాంస్కృతిక సంస్థలు పురస్కారాలతో సత్కరించాయి; 2005లో హైదరాబాద్‌కు చెందిన విశ్వసాహితి సంస్థ నుంచి పోతుకూచి వంశ పురస్కారం, 2009లో అద్దంకి జానపద కళాపీఠం నుంచి శ్రీశ్రీ పురస్కారం, 2011లో ఖమ్మం జిల్లా సాంస్కృతిక శాఖ ఉగాది పురస్కారం అందుకున్నారు.తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తెలుగు రక్షణ వేదిక, హైదరాబాద్ అందించిన శతకవి పురస్కారాన్ని నారాచంద్రబాబునాయుడు చేతులమీదుగా స్వీకరించడం ఆయన కీర్తి కిరీటంలో మరో కలికితురాయి. ఇప్పుడు 2026 సంవత్సరానికి గాను ఆంధ్రప్రదేశ్‌లోని పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన ప్రతిష్ఠాత్మక నారంశెట్టి బాలసాహిత్యపీఠం ప్రకటించిన జాతీయ స్థాయి బాల సాహిత్య పురస్కారానికి తెలంగాణ రాష్ట్రం తరపున డాక్టర్ అమ్మిన శ్రీనివాసరాజు ఎంపిక కావడం ఆయన సాహితీ ప్రస్థానంలో మరో సువర్ణ ధ్యాయం.బాలల దినోత్సవమైన నవంబరు 14న ప్రకటించిన ఈ పురస్కారాన్ని డిసెంబరులో నిర్వహించ నున్న ప్రత్యేక సాహితీ వేదుకలో ఆరు వేల రూపాయల నగదు,ప్రశంసా పత్రం,జ్ఞాపికతో ప్రదానం చేయనున్నారు . తెలుగు బాల సాహిత్య వికాసానికి దశాబ్దాలుగా కృషి చేస్తున్న నారంశెట్టి బాలసాహిత్య పీఠం వంటి సంస్థ నుంచి ఈ గౌరవం దక్కడం ఆయన అక్షర తపస్సుకు లభించిన సముచిత ఫలితం. నేటి డిజిటల్ యుగంలో చరవాణులు, అంతర్జాలం,దృశ్య మాధ్యమాల ప్రభావం తో చిన్నారు ల్లో పుస్తక పఠనాసక్తి సన్నగిల్లుతున్న తరుణంలో బాల సాహిత్యం ఆవశ్యకత గతంలో కంటే ఎంతో పెరిగింది. తెలుగు సాహిత్య చరిత్రలో నన్నయ కాలం నుంచి ఆధునిక యుగం వరకు ఎందరో కవులు భాషను సుసంపన్నం చేసినప్పటికీ,బాలల కోసం ప్రత్యేకంగా రాయడ మనే ప్రక్రియ గిడుగురామ్మూర్తి పంతులు, చింతా దీక్షితులు, న్యాయపతి రాఘవరావు,నార్ల చిరంజీవి వంటి మహానుభావుల కృషితో ఒక బలమైన ఉద్యమంగా రూపుదిద్దుకుంది.ఆ మహనీయుల వారసత్వాన్ని నేటి తరానికి అందిస్తూ,పుస్తక పఠనాన్నిఅలవాటుగా మార్చేందుకు అమ్మిన శ్రీనివాసరాజు వంటి అధ్యాపక రచయితలు చేస్తున్న కృషి వెలకట్టలేనిది. ఒక మారుమూల గ్రామంలో జన్మించి, అధ్యాపక వృత్తిలో స్థిరపడి, వందలాది రచనలతో తెలుగు సాహితీవనంలో తనకంటూ ఒకస్థానాన్ని ఏర్పరచుకున్న డాక్టర్ అమ్మిన శ్రీనివాస రాజుకు ఈ జాతీయ పురస్కారం మరిన్ని అత్యున్నత శిఖరాలను అధిరోహించేందుకు స్ఫూర్తి నివ్వాలని,ఈ అక్షర సుమం తెలుగు భాషా కీర్తిపతాకను మరింత ఎత్తుకు ఎగురవేయాలని మనసారా అభినందిస్తూ ఆకాంక్షిద్దాం.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి

-రాఘవరెడ్డి కుటుంబానికి ఓదార్పు





చురకలు ప్రతినిధి హుజురాబాద్ నవంబర్ 17 : హుజురాబాద్ పట్టణంలోని సత్యనారాయణ స్వీట్ హౌస్ యజమాని ప్రతాప రాఘవరెడ్డి సోమవారం గుండెపోటుతో మృతి చెందగా వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఆదివారం రాఘవరెడ్డికి గుండెలో నొప్పి రాగా కుటుంబ సభ్యులు ఆయనను హైదరాబాద్ లోని యశోద ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆయన సోమవారం మృతి చెందారు. సోమవారం బాధిత కుటుంబ సభ్యులు, రాఘవరెడ్డి కుమారుడు నాగరాజు దంపతులను ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఓదార్చారు. రాఘవరెడ్డి మృతి బాధాకరమని పేర్కొంటూ ఆయన మృతికి సంతాపాన్ని కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

హోటల్ రంగంలో మంచి పేరు తెచ్చుకున్న రాఘవరెడ్డి

హుజురాబాద్ పట్టణంలో 50 ఏళ్ల క్రితమే సత్యనారాయణ స్వీట్ హాజరు ప్రారంభించిన రాఘవరెడ్డి సుదీర్ఘకాలం వినియోగదారులకు సేవలు అందించారు. హుజురాబాద్ ప్రాంతంలో సత్యనారాయణ స్వీట్స్ అంటే తెలియని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. సత్యనారాయణ స్వీట్ హౌస్ లో టీ చాయ్.. కి ప్రసిద్ధి. ఉపాధ్యాయులకు, పాత్రికేయులకు, రాజకీయ నాయకులకు, కార్యకర్తలకు స్వీట్ హౌస్ అడ్డాగా ఉండేది. సాయంత్రం పూట టీ తాగేందుకు చాలామంది ఇక్కడికి వచ్చేవారు. ఇక్కడ టిఫిన్ కూడా బాగుంటాయని పేరు ఉంది. రాఘవరెడ్డి మంచి వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి. ఎవరికి హాని తలపెట్టని విధంగా వ్యవహరించేవారు. వివాదరహితునిగా ఉండేవారు. కష్టపడి తన వ్యాపారాన్ని అభివృద్ధి చేశారు. రాఘవరెడ్డి మృతి పట్ల ప్రతాపవాదలో విషాదం నెలకొంది. పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి ఆయనకు నివాళులర్పించారు. రాఘవరెడ్డి అంత్యక్రియలు మంగళవారం జరిగాయి.

కొండగట్టు చందనోత్సవానికి గవర్నర్‌కు ఆహ్వానం



చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 17 : ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు అంజనేయస్వామి చందనోత్సవం, మహాసంప్రోక్షణ, నిజరూప దర్శన మహోత్సవాలకు హాజరుకావాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను మంగళవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఆలయ అధికారులు, అర్చకులు ఆహ్వానించారు. ప్రసిద్ధ పుణ్యక్షేతం కొండగట్టులో ఈ నెల 15 నుంచి 20 వరకు 60 ఏళ్లకోసారి జరిగే ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, దేవాదాయ శాఖ ప్రధాన కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ ఎం. హనుమంతరావు మంగళవారం లోక్ భవన్ లో గవర్నర్ ను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఆలయ విశిష్టతను వివరించారు. అంతకుముందు మహిళా భద్రత, షీ టీమ్స్ డీజీపీ డాక్టర్ సౌమ్య మిశ్రా గవర్నర్ ను కలిసి మహిళా భద్రత చర్యలను వివరించారు.

ఎమ్మెల్యే నివాసంపై కాంగ్రెస్ దాడి అప్రజాస్వామికం

-మాజీ జడ్పీ చైర్ పర్సన్ వసంత సురేష్



చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 17 : కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కుమార్ మెట్ పల్లిలోని నివాసంపై కాంగ్రెస్ నాయకులు చేపట్టిన ముట్టడి, దాడిని తీవ్రంగా ఖండిస్తున్నానని జగిత్యాల మాజీ జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ప్రజా తీర్పును జీర్ణించుకోలేకనే కాంగ్రెస్ నాయకులు కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. కోరుట్లలో డాక్టర్ సంజయ్ విజయాన్ని స్థానిక కాంగ్రెస్ నేతలు జీర్ణించుకోలేక ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధి నివాసంపై దాడికి దిగడం రాజకీయ అసహనానికి నిదర్శనమన్నారు. గతంలో విద్యాసాగర్ రావు చేసిన అభివృద్ధిని గుర్తించి ప్రజలు ఆయన తనయుడిని ఎన్నుకున్నారని, అధికారంలో ఉన్న కాంగ్రెస్ హామీల అమలుపై దృష్టి పెట్టాలని, రాజకీయంగా ఎదుర్కోవాలంటే అభివృద్ధిలో పోటీ పడాలన్నారు. బాధ్యులపై విచారణ జరిపి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని పోలీసులను డిమాండ్ చేశారు.

ఘనంగా కెప్టెన్ 89వ జన్మదిన వేడుకలు



చురకలు ప్రతినిధి హుజురాబాద్ నవంబర్ 17 : వివిఆర్ డిగ్రీ కళాశాలలో కమల ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యులు కెప్టెన్ వొడితల లక్ష్మీకాంతరావు 89వ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ టి. అజయ్ కుమార్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు కలిసి కేక్ కట్ చేసి కెప్టెన్ వొడితల లక్ష్మీకాంతరావు గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కెప్టెన్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి. అజయ్ కుమార్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై ఎస్పీ సమీక్ష సమావేశం



చురకలు ప్రతినిధి,నిర్మల్, నవంబర్, 17 : నిర్మల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ జానకిషర్మిల నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పెండింగ్ కేసుల త్వరిత పరిష్కారం,ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు,బాధితులకు సత్వర న్యాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ-సాక్ష్య, జీరో ఎఫ్ఐఆర్, సీసీటీఎన్ఎస్ విధానాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సైబర్ నేరాలు, గంజాయి అక్రమ రవాణా, ఆస్తి నేరాల నియంత్రణకు నిఘా పెంచాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేయాలని తెలిపారు. అనంతరం ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో పోలీస్‌వాహనాలను తనిఖీ చేసి,వాటిని ఎల్లప్పుడూ విధులకు సిద్ధంగా ఉంచాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో ఖైసా అడిషనల్ ఎస్పీ సాయి కిరణ్,నిర్మల్ డిఎస్పీ శ్రీనివాస్,జిల్లాలోని పోలీస్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి మాజీ జెడ్పీటీసీ రాజీనామా



చురకలు ప్రతినిధి రాజన్న సిరిసిల్ల,నవంబర్ 17 : రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీలో కీలక నేతలుగా ఉన్న సిరిసిల్ల, తంగళ్ళపల్లి మాజీ జెడ్పీటీసీ పూర్ణాని మంజుల - రామ్ లింగారెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. కాంగ్రెస్ పార్టీతో పాటు పార్టీ క్రియాశీలక సభ్యత్వానికి కూడా రాజీనామా చేస్తున్నట్లు వారు ప్రకటించారు.ఈ మేరకు తమ రాజీనామా పత్రాన్ని సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి గారికి పంపించారు.గత కొన్ని సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నామని, అయితే ప్రస్తుత అనివార్య, వ్యక్తిగత కారణాల దృష్ట్యా పార్టీని వీడాలని నిర్ణయించుకున్నట్లు వారు తమ లేఖలో పేర్కొన్నారు. ఇంతకాలం పార్టీలో తమకు అండగా నిలిచి, సహకరించిన పార్టీ పెద్దలకు, నాయకులకు మరియు కార్యకర్తలందరికీ వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలి

-శాస్త్రవేత్త వేణుగోపాల్



చురకలు విలేఖరి వీణవంక నవంబర్ 17 : వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలనీ శాస్త్రవేత్త వేణుగోపాల్ అన్నారు. మండలంలోని బొంతుపల్లె గ్రామ పంచాయతీలో మంగళవారం "ఖేత్ బచావో అభియాన్" అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జమ్మికుంట కేవీకె శాస్త్రవేత్త వేణుగోపాల్, వీణవంక ఏవో గణేష్ మాట్లాడుతూ..ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా రైతులు నీటి యాజమాన్యం, నేల ఆరోగ్య సంరక్షణపై దృష్టి సారించాలని సూచించారు. నీటి ఎద్దడిని అధిగమించడానికి వరి సాగును తగ్గించి, తక్కువ కాలపరిమితితో పాటు తక్కువ నీటితో పండే నూనె గింజలు, ఇతర ఆరుతడి పంటలను సాగు చేయాలని రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బావు సంపత్, ఏఈవో లక్ష్మీ ప్రసూన, వార్డు సభ్యులు బావు శంకర్, కర్ర మంజుల,గ్రామ రైతులు పాల్గొన్నారు.

నూతన నియామకం





చురకలు (పెద్దపెల్లి జిల్లా ప్రతినిధి)కమాన్‌పూర్ నవంబర్ 17 : కమాన్ పూర్ మండలం గుండారం గ్రామపంచాయతీ పరిధిలోని రాజాపూర్ ఎమ్మార్పీఎస్ కమిటీని ప్రకటించారు. అధ్యక్షునిగా అవునూరి విజయ్, అధికార ప్రతినిధిగా అవునూరి సామ్రాట్, ప్రధాన కార్యదర్శులుగా అవునూరి శివ సాయి ప్రసాద్, అవునూరి రాకేష్, ఉపాధ్యక్షులుగా ఆవు నూరి వేణు, అవునూరి సదయ్య, అవునూరి ప్రశాంత్, కోశాధికారిగా అవునూరి అవినాష్, కార్యదర్శిలుగా ఆవునూరి వెంకటరమణ, అవునూరి సదయ్య, అవునూరి వంశీ, ఆవు నూరి బాలకృష్ణ, సహాయ కార్యదర్శులుగా ఆవునూరి ప్రభాకర్, ఆవు నూరి శ్రీనివాస్, అవునూరి శ్రీనివాస్, అవునూరి రాజు, అవునూరి వంశీ, అవునూరి శంకరయ్య, కార్యవర్గ సభ్యులుగా అవునూరు కిరణ్ తదితరులు ఏకగ్రీవంగా నియమితులయ్యారు. కమాన్ పూర్ మండల ఎంఆర్పీఎస్ ఇన్చార్జి ప్రకటించారు.

మానకొండూర్ పోలీస్ స్టేషన్‌ను

ఆకస్మిక తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం

-రికార్డులు,లాకప్, పరిసరాలను పరిశీలించిన సీపీ

-బాధితులకు సత్వర న్యాయం అందించాలని ఆదేశం





చురకలు క్రైమ్ ప్రతినిధి, కరీంనగర్, నవంబర్ 17 : కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మానకొండూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్‌లోని జనరల్ డైరీ, ఎఫ్ఐఆర్ కాపీలు, పెండింగ్ కేసులు, రౌడీ షీటర్ల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణ, రిసెప్షన్ కౌంటర్, లాకప్ రూమ్‌లను పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, బాధితుల సమస్యలను శ్రద్ధగా విని వారికి త్వరితగతిన న్యాయం చేకూర్చాలని సిబ్బందిని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి అలసత్వం వహించరాదని, స్టేషన్ పరిధిలో నిరంతరం పెట్రోలింగ్ మరియు నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని మానకొండూర్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (సీఐ) శ్రీలతతో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

-విద్యతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

-విద్యార్థులకు డ్రగ్స్ నివారణ, ఎన్‌డీపీఎస్ చట్టంపై అవగాహన



చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట నవంబర్ 17 : విద్యార్థులు చిన్న వయస్సులోనే మాదకద్రవ్యాలకు, చెడు అలవాట్లకు బానిసలుగా మారకుండా జాగ్రత్తగా ఉండాలని, చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధులు సూచించారు.రాజన్న సిరిసిల్ల జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో DAWN యూనిట్ సభ్యులు సుందరయ్యనగర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు మాదకద్రవ్యాల నివారణ, ఎన్‌డీపీఎస్ (NDPS) చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్యానెల్ న్యాయవాది కడగండ్ల తిరుపతి మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభ్యాసం, కుటుంబ జీవితం, భవిష్యత్తు తీవ్రంగా దెబ్బతింటాయని వివరించారు. మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, విక్రయం, కలిగి ఉండటం వంటి నేరాలకు సంబంధించి ఎన్‌డీపీఎస్ చట్టం–1985లో పొందుపరిచిన నిబంధనలు, ఉల్లంఘించిన వారికి విధించే శిక్షలు, ఎదురయ్యే చట్టపరమైన పరిణామాలపై అవగాహన కల్పించారు.విద్యార్థులు చెడు స్నేహాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని, క్రీడలు, సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవయ్య, ఉపాధ్యాయ బృందం, సీనియర్ న్యాయవాదులు కుంట శ్రీనివాస్, నర్మేట రమేష్, అందె శ్రీను, పారాలీగల్ వాలంటీర్ లావణ్య, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



ఐకేపీ వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



చురకలు విలేఖరి ?వీణవంక నవంబర్ 17 :

వీణవంక మండల పరిధిలోని లస్మక్కపల్లి గ్రామంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐకేపీ వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు, గెల్లు శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కేంద్రంలో గ్రేడ్–ఏ రకానికి రూ. 2,461, గ్రేడ్–సి రకానికి రూ. 2,441 మద్దతు ధర చెల్లిస్తుండగా, సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం అదనంగా రూ. 500 బోనస్ అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దాసారపు శ్రీనివాస్, వీఓ అధ్యక్షురాలు దాసారపు రోజా, కార్యదర్శి మ్యాకల సమత, కోశాధికారి కల్వల స్వప్న, సీసీ ఆనంద్, వీఓఏ రజిత, రైతులు, హమాలీ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

క్లబ్ సెక్రటరీగా "కట్కూరి"ని

సన్మానించిన మాజీ మంత్రులు



-నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి గంగుల, ఎమ్మెల్యేలు

-కెప్టెన్ జన్మదిన కేక్ కట్ చేసిన బిఆర్ ఎస్ నేతలు

చురకలు ప్రతినిధి హుజురాబాద్ నవంబర్ 17 : హుజురాబాద్ క్లబ్ ఎన్నికల్లో సెక్రటరీగా విజయం సాధించిన కట్కూరి మల్లారెడ్డిని మాజీ మంత్రి గంగుల కమలాకర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్ రమణ, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు, మాజీ ఎస్సి కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ తదితరులు మంగళవారం శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతి తక్కువ సమయంలో క్లబ్ ను తీర్చిదిద్దిన ఘనత కెప్టెన్ లక్ష్మీకాంత రావుకు దక్కిందని అన్నారు. క్లబ్ ను కెప్టెన్ ఆకాంక్షకు అనుగుణంగా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత నూతన కార్యవర్గం ఉందని అన్నారు. నూతన కార్యవర్గానికి వారు శుభాకాంక్షలు తెలిపారు.

కెప్టెన్ జన్మదిన వేడుకలు

మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావు జన్మ దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్, కౌశిక్ రెడ్డి తో పాటు నారదాసు లక్ష్మణరావు, ఎల్ రమణ తదితరులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపి కెప్టెన్ కుమారుడు మాజీ ఎమ్మెల్యే సతీష్ బాబుకు కేక్ తినిపించారు. కెప్టెన్ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయాన్ని

దర్శించుకున్న ప్రముఖులు



చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డి పేట నవంబర్ 17 :

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రతిష్ట చేశారు.. ఈ సందర్భంగా గొల్లపల్లి సర్పంచ్ కొండ రమేష్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వంగ గిరిధర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండారి బాల్ రెడ్డి, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు శ్యామంతుల అనిల్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు మహాదేవ్, కంప్యూటర్ ఆపరేటర్ రామచంద్రం, జర్నలిస్టు పెంటం శ్రీనివాస్ తదితరులు హాజరై ఎల్లమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ రూ.5116 నగదును గౌడ సంఘం సభ్యులు పందిర్ల లింగం గౌడ్ కు కానుకగా అందించారు. పాల్గొన్న వారికి గౌడ సంఘం సభ్యులు ఆత్మీయంగా కండువాలు కప్పి ఆశీర్వచనం ఇచ్చారు.